# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- మరో మూడు రోజుల్లో పారిశుధ్య పనులు పూర్తి చేసి విజయవాడను యథాస్థితికి తీసుకువస్తామని మంత్రి పి. నారాయణ వెల్లడించారు.

- ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉండి సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని ఉన్నతాధికారులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు.

- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈరోజు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించారు.

- ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద వరద ఉధృతి పెరుగుతుండడంతో గోదావరి నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

- ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఏలూరు జిల్లాలోని నూజివీడు ట్రిపుల్ ఐటిలో అవగాహన సదస్సు నిర్వహించారు.

==============================

బుడమేరు వరద ముంపు ప్రాంతాల్లో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ ఈరోజు ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... సింగ్ నగర్‌లో వరద ముంపు తగ్గిందన్నారు. నాలుగైదు డివిజన్లోని లోతట్టు ప్రాంతాల్లో మాత్రమే నీరు నిలిచిపోయి ఉందన్నారు. కండ్రిక వద్ద రోడ్డు సమాంతరంగా లేదని.. ఒక వైపు నీరు నిలవడంతో మోటార్లతో కాలువలకు మురుగు నీటిని మళ్లించామని తెలిపారు. రేపు సాయంత్రానికి ఎక్కడా వరద నీరు లేకుండా చేస్తామన్నారు. పాడైన వస్తువులు, వాహనాల విషయంలో కూడా ఇన్సూరెన్స్ కంపెనీలతో ప్రభుత్వం మాట్లాడుతుందని, వాహనాల మరమ్మత్తులకు 50 శాతం ఖర్చును ప్రభుత్వం భరిస్తుందన్నారు. 10 వేల మంది కార్మికులు ముంపు ప్రాంతాల్లోని పరిశుభ్రత పనుల్లో నిమగ్నమయ్యారని.. మూడు రోజుల్లో విజయవాడ పూర్తిగా యథాస్థితికి వస్తుందని మంత్రి నారాయణ వెల్లడిస్తూ....

(వాయిస్ 35 సెకన్లు)

================================

రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈరోజు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలోని పలు గ్రామాలు అతలాకుతలం అయ్యాయి. దీంతో చింతపల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో మంత్రి పర్యటించారు. ముందుగా లంబసింగి ప్రాంతాన్ని సందర్శించి పెంటపాడు సమీపంలో కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలించారు. రాకపోకలకు అంతరాయం కలగకుండా త్వరితగతిన మరమ్మత్తులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే చట్రాపల్లి సంఘటనలోని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశించారు. మృతి చెందిన వారి కుటుంబానికి నష్ట పరిహారం 5 లక్షల రూపాయలు అందజేశామని మంత్రి తెలిపారు. గిరిజనులు తమ పంట పొలాలను పూర్తిగా నష్టపోయామని మంత్రికి వెల్లడించారు. నష్టపోయిన రైతులను గుర్తించి నష్టపరిహారం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి గిరిజనులకు అవగాహన కల్పించాలని, వాగులు పొంగిపొర్లడంతో వారు అప్రమత్తంగా ఉండాలని, వాగులు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్, ఎస్పీ అమిత్ బర్ధర్ తదితరులు పాల్గొన్నారు.

================================

ప్రకృతి వైపరీత్యాల పట్ల అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యల్లో బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీవర్షాల వలన జరిగిన నష్టాలు, తీసుకున్న సహాయక చర్యలపై విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్లు, ఎస్.పిలతో విశాఖ కలెక్టరేట్ నుంచి ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి మాట్లాడుతూ... వర్షాకాలంలో నీటి పారుదల శాఖ అధికారులతో జిల్లాల్లోని జలాశయాల స్థితిగతులపై జిల్లా కలెక్టర్లు సమీక్షించాలని తెలిపారు. ఎప్పటికప్పుడు రిజర్వాయర్ల గేట్ల పని తీరును పునః సమీక్షించుకోవాలని, పని చేయని, పాడైన గేట్లకు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. విజయవాడలో తీసుకున్న సహాయక రక్షణ చర్యల మాదిరిగా చర్యలు చేపట్టాలని అధికారులకు హోం మంత్రి సూచిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

================================

గోదావరి నది పరివాహక ప్రాంతాలలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మొదటి, రెండవ స్థాయి ప్రమాద హెచ్చరికలు జారీ చేసే అవకాశం ఉన్నందున రానున్న 72 గంటల పాటు కోనసీమ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. అమలాపురం కలెక్టరేట్ లో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ నుండి దిగువకు 7.5 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని... ఈరోజు రాత్రికి 10 లక్షల క్యూసెక్కులు విడుదల చేసి మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసే అవకాశం ఉందని అన్నారు. అదేవిధంగా రేపు ఉదయానికి రెండవ వరద ప్రమాద హెచ్చరికను జారీ చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. గోదావరి నది దాటడానికి వినియోగించే బోట్లు వద్ద అధికారులు సూచించిన మోటరైజడ్ పడవలలోనే లైఫ్ జాకెట్లు వేసుకుని తప్పనిసరిగా ప్రయాణం చేయాలని సూచించారు. వరద సహాయక చర్యలకు రెవెన్యూ సిబ్బంది తమ పరిధిలోని సచివాలయ సిబ్బంది సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆదేశించామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయితే గంటి పెదపూడి ఆవాసం ముంపు బారిన పడుతుందని... రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి 44 ఆవాసాలు ముంపు బారిన పడతాయని కలెక్టర్ తెలిపారు.

================================

ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఏలూరు జిల్లాలోని నూజివీడు ట్రిపుల్ ఐటిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శర్మిష్ట మాట్లాడుతూ... నేటి సమాజంలో విద్యార్థులు ఒత్తిడికి గురవ్వడానికి గల కారణాలు.. వాటిని ఏ విధంగా అధిగమించాలి అనే విషయాలపై పలు సూచనలు చేశారు. ఆదే విధంగా మానసిక ఆరోగ్యం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మానసిక వైద్యనిపుణులు డాక్టర్ పవిత్ర మాట్లాడుతూ... ఆతహత్యలకు ప్రేరేపించే కారణాలు, వాస్తవాలు, అపోహలు, మానసిక సమస్యలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న వైద్యసేవలు గురించి tele Manas toll free number 14416 గురించి వివరించారు.

================================

ఈరోజు రాష్ట్ర హోం శాఖమంత్రి వంగలపూడి అనిత విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జిల్లాకు సంబంధించిన వివరాలు తెలియజేస్తూ.. ఇటీవల సంభవించిన తుఫానులను ఎదుర్కొనడానికి జిల్లాలో అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో ఒక మేజర్ నీటి పారుదల ప్రోజెక్టు, 4 మీడియం ప్రోజెక్టులు ఉన్నాయని.. వాటి సామర్థ్యానికి లోపల నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. ఒరిస్సా రాష్ట్రంలో వర్షాలు పడుతున్నాయని, వాటి మూలంగా నీటి ప్రవాహం పెరిగే అవకాశమున్నట్లు తెలిపారు. ముందు జాగ్రత్తగా నది పరివాహక ప్రాంతాలలోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. వర్షాలకు 134 ఎకరాలలో పండ్ల తోటలు, 24 ఎకరాలలో పంటలకు నష్టం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాలలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మారుమూల, గిరిశిఖర గ్రామాలలో ఉన్న గర్భిణీలను వసతి గృహాలకు తరలించామని కలెక్టర్ ఈ సందర్భంగా తెలియజేశారు. జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవరెడ్డి మాట్లాడుతూ... పాచిపెంట, సాలూరు, కొమరాడ మండలాలలో ఎగువ కురిసిన వర్షాలకు గెడ్డలు ఆకస్మికంగా పొంగుతున్నాయని, ఇటీవల పాచిపెంట మండలంలో హర్యానా రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు గెడ్డలో కొట్టుకుపోయి మృతి చెందారని తెలిపారు. ఇటువంటి సంఘటనలను నివారించడానికి గెడ్డలపై గల కల్వర్టులు ఎత్తును పెంచాలని తెలిపారు. గెడ్డలు పొంగిన సందర్భంలో తాత్కాలిక చర్యగా అక్కడ ప్రజలు రాకపోకలు జరుపకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గణేష్ విగ్రహాల నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసు శాఖ నుండి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలియజేశారు.

================================
================================